క్లుప్తంగా

'పోషణ్ బి.. పడాయ్ బి'పై శిక్షణ



జ్యోతిప్రజ్వలన చేస్తున్న రౌఫ్‌ఖాన్

మంచిర్యాలటౌన్: జిల్లా శిశు, మహిళ, వయో వృద్ధులు, దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో సోమవారం జెడ్పీ కార్యాలయంలో 'పోషణ్ బి–పడాయ్ బి'పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా సంక్షేమశాఖ అధికారి రౌఫ్‌ఖాన్ ప్రారంభించారు. జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లకు ప్రీస్కూల్ నిర్వహణపై చిన్నారులకు ఏ విధంగా బోధించాలనే దానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జ్యోతి, చందన, ఇందిర, సంధ్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దండేపల్లి: 3నుంచి 6 ఏళ్ల పిల్లల్లో అభివృద్ధి, దివ్యాంగ పిల్లల రక్షణపై ప్రత్యేక దృష్టిసారించాలని లక్సెట్టిపేట ఐసీడీఎస్ సీడీపీవో రేష్మా సూచించారు. దండేపల్లి ఉన్నత పాఠశాలలో లక్సెట్టిపేట, దండేపల్లి మండలాల అంగన్‌వాడీ టీచర్లకు 'పోషణ్ బీ–పడాయి బీ' కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. శిక్షణకు టీచర్లు తప్పక హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వాణి, మమత, వెంకటలక్ష్మి, రమాదేవి, రెండు మండలాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

17న జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా ఉపాధి కల్పన శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17న బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని టాస్క్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉదయం 10.30గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తూట్ గ్రూప్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు 10, బిగ్‌సీ మొబైల్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు10, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ 10, స్టోర్ మేనేజర్లు13, క్యాషియర్ 05 పోస్టులకు పురుష అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. వివరాలకు ఫోన్ 89787 07913, 77022 84181 నంబర్లలో సంప్రదించాలన్నారు.

17న విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో ఈ నెల 17న ఉదయం 10గంటలకు విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేషనల్ ఓపెన్ కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రామకృష్ణాపూర్: ఈ నెల 14న హైదరాబాద్‌లోని బొమ్మక్ బాలయ్య గార్డెన్‌లో విక్టరీ షొటోకాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 29వ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో రామకృష్ణాపూర్‌కు చెందిన విద్యార్థులు పలు విభాగాల్లో సత్తాచాటి బహుమతులు పొందారు. కటాస్, కుమితే విభాగాల్లో విద్యార్థులు తస్విక, అశ్విత్, సహస్ర, యశ్వంత్, ప్రహర్షిని, దీక్షిత, సంవేద్య, వందన, మనీష్‌లు ప్రథమ, తృతీయ బహుమతులు సాధించినట్లు కోచ్ జూల శ్రీనివాస్ తెలిపారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

మంచిర్యాలఅర్బన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలంటూ డిమాండ్ చేస్తూ సోమవారం ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల ఎదుట అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమాల్లో జిల్లా ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్యం సంఘం సభ్యులు ఎస్వీ రమణ, నర్సయ్య, శ్రీధర్‌రావు, మల్లయ్య ఉన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంచిర్యాలలో వివిధ డిగ్రీ, పీజీ కళాశాలల ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు నీరటి రాంప్రసాద్ మద్దతు తెలిపారు.

విలీన దినోత్సవంగా ప్రకటించాలి

బెల్లంపల్లి/జన్నారం/లక్సెట్టిపేట: సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిప్పనర్సయ్య, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, సీపీఐ రాష్ట్ర నాయకులు మేకల దాసు డిమాండ్ చేశారు. సోమవారం ఆయా మండలాల్లో వారు మాట్లాడారు. జెండాలు ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు డీఆర్.శ్రీధర్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు బి.పూర్ణిమ, పట్టణ సహాయకార్యదర్శి బి.తిలక్, బీకేఎంయూ జాతీయ సమితి సభ్యుడు అక్కెపల్లి బాపు తదితరులు పాల్గొన్నారు.

'ఆసరా' పెంపునకు నిరసన

- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన
- తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేత



కాసిపేట: తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పింఛన్ దారులు

బెల్లంపల్లి/జన్నారం/కోటపల్లి/కాసిపేట/జైపూర్/చెన్నూర్/మందమర్రిరూరల్: ఆసరా పింఛన్ రూ.4వేలకు, దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలనే డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం జన్నారం, కోటపల్లి, కాసిపేట, జైపూర్, చెన్నూర్, బెల్లంపల్లి, మందమర్రి మండలాల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. దివ్యాంగులు, వృద్ధులు నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ముందు దివ్యాంగుల పింఛన్ రూ.4000 నుంచి రూ.6000, వృద్ధులు, వితంతువులతో పాటు ఇతర రకాల పింఛన్లు రూ.2000 నుంచి రూ.4000కు పెంచుతామని హామీ ఇచ్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల హామీని నెరవేర్చాల్సిన బాధ్యత సీఎంపైన ఉందన్నారు. అధికార పగ్గాలు చేతబట్టి 22 నెలలు కావస్తున్నా శ్రద్ధ చూపకపోవడం మోసమన్నారు. ఇప్పటికైనా పింఛన్ పెంపుదలకు చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో జైపూర్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేశ్, జన్నారంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ప్రభుదాస్, వీహెచ్‌పీఎస్ నియోజకవర్గ అధ్యక్షురాలు సుగుణ, కోటపల్లిలో మండల ఇన్‌ఛార్జి తుంగ రమేశ్, కాసిపేటలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ గొడిసెల క్రాంతి, చెన్నూర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు చకినారపు మల్లేశ్, బెల్లంపల్లిలో పట్టణ అధ్యక్షుడు మహేష్, మందమర్రిలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి జీడి సారంగం, అధ్యక్షుడు ఆసంపల్లి శివకుమార్, పట్టణ అధ్యక్షుడు చిలుముల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జన్నారంలో దివ్యాంగులు, వృద్ధుల నిరసన



బెల్లంపల్లి: తహసీల్దార్ కృష్ణకు వినతి

'ఉపాధి' డబ్బులు ఇప్పించాలని నిరసన



నిరసన తెలుపుతున్న కూలీలు

కాసిపేట: మండలంలోని తాటిగూడకు చెందిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కూలీలు తమకు కూలీ డబ్బులు ఇప్పించాలని సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మే, జూన్ నెలలో పనిచేసిన కూలీ డబ్బులు ఇంతవరకు రాలేదని అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోయారు. విషయం తెలుసుకున్న ఈజీఎస్ ఏపీవో నవీన్‌కుమార్ అక్కడికి చేరుకొని ఖాతాల్లో డబ్బులు జమయ్యాయని, మీ ఖాతాల్లో సమస్య ఉండవచ్చని చెప్పడంతో కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కరిద్దరి ఖాతాలు సమస్య ఉంటాయని, అందరి ఖాతాలు ఒకేసారి పనిచేయకుండా పోతాయా అంటూ ప్రశ్నించారు. వెంటనే సమస్య పరిష్కరించాలని, లేనట్టైతే ఆందోళనలు ఉధృతం చేయనున్నట్లు హెచ్చరించారు. త్వరలో సమస్య పరిష్కరిస్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మడావి వెంకటేశ్, మడావి మధుకర్, శేఖర్, వేలది జంగుభాయి, ప్రమీల, విజయ, లక్ష్మి, వేలాధి రాధిక, సిడాం సుజాత, శిరీషా, లక్ష్మి తదితరులున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థినికి సర్టిఫికెట్‌ను అందిస్తున్న సబ్ కలెక్టర్

బెల్లంపల్లి: విద్యార్థులు విద్యాలయంలో నేర్చుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజానికి ఉపయోగపడేలా మలచాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిప్లొమా పూర్తిచేయడం ఒక గమ్యం కాదని, అది జీవితంలో కొత్త ప్రయాణానికి ఆరంభమన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.దేవేందర్ మాట్లాడు తూ.. గ్రాడ్యుయేషన్ డే ప్రతి విద్యార్థి జీవితంలో మరుపురానిదన్నారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాలలోని ప్రతి బ్రాంచ్ నుంచి ఉత్తమంగా రాణిస్తున్న విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. 2025లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సబ్ కలెక్టర్, ప్రిన్సిపాల్, శాఖాధిపతులు, అలుమ్ని అతిథులు డిప్లొమా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అలుమ్ని అతిథులు సీ.హెచ్.రమేశ్, జీ.శ్రీనివాస్, డి.శ్రీనివాస్, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు విజయవంతం చేయాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్

మంచిర్యాలటౌన్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినంను పురస్కరించుకొని సేవా పక్షం కార్యక్రమాల్లో భాగంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలను బీజేపీ నాయకులు విజయవంతం చేయాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎం కన్వెన్షన్ హాల్లో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కాలేజీరోడ్డులోని ఏకలవ్య ఆశ్రమంలో సేవా భారతి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను బండి సంజయ్ ప్రారంభించి ఉచితంగా కంప్యూటర్, కుట్టు శిక్షణ పొందుతున్న విద్యార్థులతో శిక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఫొటోట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ

పాతమంచిర్యాల: ఈ నెల 19–21వరకు హైదరాబాద్‌లో నిర్వహించే ఫొటోట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను సోమవారం జిల్లా కేంద్రంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రామగుండం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, ఫొటో అండ్ వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు వినతి

తాండూర్: మండలంలో రైల్వే పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయించాలని బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు తిరుపతి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కోరారు. ఈ మేరకు సోమవారం మంచిర్యాలలో కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు.

ఘనంగా హిందీ దివస్



హిందీ కవుల వేషధారణలో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక లక్ష్మీనగర్ శ్రీ చైతన్య స్కూల్లో హిందీ దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. హిందీ కవులు సూరదాస్, కబీర్, తులసీదాస్ వేషధారణలో విద్యార్థుల నాటిక ద్వారా హిందీ సాహిత్య గొప్పతనాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. హిందీ ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ అయూబ్ సత్కరించారు. అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అరవిందరెడ్డి, కో–ఆర్డినేటర్లు నాగరాజు, జయశ్రీ, డీన్ శ్యాం, ఇన్‌చార్జీలు కృష్ణవేణి, హిందీ ఉపాధ్యాయులు సఫియా, స్నేహలత పాల్గొన్నారు.

తాండూర్: మండలంలోని అచ్చలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్‌ను సోమవారం ఘనంగా నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయుడు ఎస్.సురేందర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఉపాధ్యాయులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

కమ్యూనిటీ భవనాల అభివృద్ధికి కృషి

- మంత్రి వివేక్ వెంకటస్వామి



పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ, కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలటౌన్: ప్రభుత్వం అన్ని రంగాలను అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకొని, కమ్యూనిటీ భవనాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందని కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి వాడలో గల కమ్యూనిటీ హాల్ పని విస్తరణ, నిర్మాణ పనులకు సోమవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, కలెక్టర్ కుమార్‌దీపక్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని, ఎన్నో అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. 2వ అంతస్తు నిర్మాణ పనులను పూర్తి చేసి జనవరి 1వ తేదీ నాటికి అందిస్తామన్నారు.

మంత్రి, ఎంపీలకు ఘన స్వాగతం..

రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణలకు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో గజమాల వేసి స్వాగతం పలికారు.

టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో..

జిల్లాకు వచ్చిన మంత్రి వివేక్‌ను తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గడియారం శ్రీహరి సోమవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద కలిసి పూలమొక్క అందించారు. కార్యక్రమంలో కో చైర్మన్ మల్లయ్య, పబ్లిసిటీ సెక్రటరీ జాడి రామ్‌కుమార్, కార్యదర్శి తంగళ్లపల్లి తిరుపతి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: జిల్లా సైన్స్ సెంటర్‌లో సోమవారం క్వాంటమ్ యుగం ప్రారంభం–సవాళ్లు అనే అంశంపై జిల్లా స్థాయి సెమినార్ నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన 30మంది విద్యార్థులు హాజరై ప్రతిభ కనబర్చారు. ముఖ్యఅతిథిగా డీఈవో యాదయ్య హాజరై మాట్లాడారు. రాష్ట్ర స్థాయి సెమినార్‌లో ప్రతిభ కనబర్చి జిల్లా పేరును నిలబెట్టాలన్నారు. సెమినార్‌లో కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌కు చెందిన శివం(ప్రథమ), క్రిష్ణవేణి హైస్కూల్‌కు చెందిన అక్షిత్(ద్వితీయ), స్లేట్ స్కూల్‌కు చెందిన మరియం (తృతీయ) స్థానం సాధించారు. సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులకు డీఈవో యాదయ్య ప్రశంసపత్రాలు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన శివం ఈ నెల 18న నిర్వహించే రాష్ట్రస్థాయి సెమినార్‌లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా, జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్, సెక్టోరల్ అధికారి చౌదరి, మూర్తి, ఎంఈవోలు మాళవీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలఅర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాయ్స్ ఉన్నత పాఠశాలలో వారధి ఫౌండేషన్, విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం సుస్థిర అభివృద్ధి కోసం ఐక్యరాజ్యసమితి సూచించిన అంశాలు భారతదేశానికి ఉపయోగకరంగా ఉన్నాయా అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రస్తుత కాలంలో సామాజిక మాధ్యమాల యొక్క ప్రభావం, ఉపయోగాలపై డిబేట్ నిర్వహించారు. పోటీల్లో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల కిష్టాపూర్‌కు చెందిన అరవిందరాణి, కె.వర్షిత, త్రివేది అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వ్యాసరచన పోటీల్లో అదే పాఠశాలకు చెందిన సాకేత, డి.అక్షిత, రిషికలు ప్రతిభ కనబర్చారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సత్యనారాయణమూర్తి, చౌదరి,శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



గుడిపేట రైతువేదిక వద్ద యూరియా కోసం వరుసలో రైతులు

- పోలీసు పహారాలో యూరియా పంపిణీ

జన్నారం: మండలంలో యూరియా కోసం రైతులు ఎదురుచూడాల్సి వస్తుంది. సోమవారం మండలంలోని పొనకల్ సొసైటీ, కలమడుగు రైతువేదిక క్లస్టర్లలో యూరియా పంపిణీ చేశారు. మండలానికి సోమవారం 36మెట్రిక్ టన్నుల యూరియా రావడంతో రైతులు ఒక్కసారిగా తరలివచ్చారు. పొనకల్ పీఏసీఎస్ నుంచి కలమడుగుకు లారీ ద్వారా తీసుకెళ్తున్న యూరియా లారీకి రైతులు అడ్డుతగిలారు. ఇక్కడే చాల అవసరం ఉంటే అక్కడికి ఎలా తీసుకుపోతారని ఆందోళనకు దిగారు. పోలీసుల సహాయంతో లారీని కలమడుగు రైతువేదికకు తీసుకెళ్లి అక్కడ దించారు. యూరియా వచ్చిన విషయం తెలియగానే ఆ క్లస్టర్ పరిధిలోని ఇందన్‌పల్లి, మురిమడుగు, టీజీ పల్లి, వెంకటపూర్ కలమడుగు గ్రామాల రైతులు తరలివచ్చారు. ఉదయం 9గంటల నుంచే యూరియా కోసం బారులు తీరగా 12గంటల నుంచి పంపిణీ మొదలైంది. పోలీసు పహారా మధ్య యూరియా పంపిణీ చేశారు. ఏవో సంగీత, ఏఈవో దివ్య, రైతులు పాల్గొన్నారు.

రైతువేదికలో యూరియా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట రైతువేదికలో సోమవారం రైతులకు యూరియా విక్రయాలు జరిపారు. పద్దనపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో గుడిపేట, నంనూర్, వేంపల్లి, ముల్కల్ల గ్రామాల పరిధిలోని రైతులకు విక్రయాలు జరపాలని భావిస్తూ గుడిపేట రైతు వేదికలో యూరియా అమ్మకాలు ఏర్పాటు చేశారు. అయితే గుడిపేట రైతువేదిక పరిధిలోని రైతులతో పాటు నర్సింగాపూర్, బుద్ధిపల్లి, కర్ణమామిడి, హాజీపూర్,దొనబండ గ్రామాలకు చెందిన రైతులు కూడా పెద్ద సంఖ్యలో తరలిరావడంతో రైతువేదికకు రైతుల తాకిడి పెరిగింది. 536యూరియా బస్తాలను విక్రయాలు జరిపారు. ఏవో కృష్ణ, హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ ఆధ్వర్యంలో రైతులకు సక్రమంగా యూరియా అందేలా ఏర్పాట్లు చేశారు.

వచ్చే ఏడాది ఉత్పత్తి సాధన కోసం సమీక్ష



సమావేశంలో చర్చిస్తున్న టార్గెట్ కమిటీ

మందమర్రిరూరల్: ఏరియాలో వచ్చే ఏడాది (2026–27)లో బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనపై జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో జీఎం రాధాకృష్ణ ఆధ్వర్యంలో కార్పొరేట్ టార్గెట్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వచ్చే ఏడాది బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు కావాల్సిన యంత్రాలు, పని స్థలాలు, పరికరాలు, కావాల్సిన స్పేర్ పార్ట్స్ గురించి క్షుణ్ణంగా చర్చించారు. గనులకు అవసరమైన భూసేకరణలో ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఏరియాలో బొగ్గు ఉత్పత్తి సాధన సమష్టిగా కృషి చేయాలని కమిటీ కన్వీనర్ మనోహర్ సూచించారు. సమావేశంలో జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) సాయిబాబ, జనరల్ మేనేజర్ (ఉపరితల గనులు) సూర్యనారాయణ, జనరల్ మేనేజర్ (భూగర్భ గనులు) రఘురాంరెడ్డి, జీఎం (మార్కెటింగ్) శ్రీనివాస్, ఎస్వో టు జీఎం విజయ్‌ప్రసాద్, ఏరియా అధికారులు ఉన్నారు.

ఇంజనీర్లు దేశ నిర్మాతలు

- ఘనంగా ఇంజనీర్స్ డే



నివాళులర్పిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: ఇంజనీర్లు దేశ నిర్మాతలని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం కుర్మ రాజేందర్ తెలిపారు. భారతరత్న, ఇంజనీరింగ్ పితామహుడు మోక్ష గుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని సోమవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఇంజనీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఏరియా వర్క్‌షాప్ డీజీఎం రవీందర్‌ను ఉత్తమ అధికారిగా ఎంపిక చేసి సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటు జీఎం సత్యనారాయణ, ఏరియా ఇన్‌చార్జి ఇంజనీర్ సాంబశివరావు, ఓసీపీ ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డి, ఏరియా రక్షణాధికారి విజయ్‌కుమార్, డీజీఎంలు రాజన్న, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఏరియా జీఎం రాధాకృష్ణ, జీఎం(కార్పొరేట్) మనోహర్, జీఎం(క్వాలిటీ) మజుందార్, జీఎం(భూగర్భ గనులు) రఘురాంరెడ్డి, జీఎం(ఉపరితల గనులు) సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

లాభాలు ప్రకటించాలి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: కంపెనీ గత ఆర్థిక సంవత్సరం సాధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏరియా ఎస్వోటు జీఎం సత్యనారాయణను కలిసి వినతిపత్రం సమర్పించారు.కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచీ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, ఆ యూనియన్ నాయకులు వెంగళ శ్రీనివాస్, సాయిల శ్రీనివాస్, తోడే సుధాకర్, సిరికొండ శ్రీనివాస్, చిగుర లక్ష్మణ్, తిలక్, సదానందం, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

మందమర్రిరూరల్: సింగరేణిలో పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏరియా జీఎం కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఏరియా పర్సనల్ మేనేజర్(పీఎం) శ్యామ్‌సుందర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ ఏరియా అధ్యక్షుడు వెంకటస్వామి, రాజేందర్, రామస్వామి, ఐలయ్య తదితరులు ఉన్నారు.

ఐఎన్టీయూసీతోనే సమస్యలు పరిష్కారం

మందమర్రిరూరల్: సింగరేణి కార్మిక సమస్యలు ఐఎన్టీయూసీతోనే పరిష్కారమవుతాయని ఆ యూనియన్ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాట్లాడారు. గుర్తింపు కార్మిక సంఘంగా ఏఐటీయూసీ గెలిచి రెండు సంవత్సరాలు కావస్తున్నా, ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని మండిపడ్డారు. సమావేశంలో ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య, నాయకులు నరేందర్, సూర్యనారాయణ, శంకర్‌రావు, ఓదెలు, సత్యనారా యణ, బుచ్చయ్య, కృష్ణమోహన్, బాపు, ఫిట్ కార్యదర్శులు ఉన్నారు.

సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘీభావ ధర్నా

పాతమంచిర్యాల: బొగ్గు పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కోల్‌కతాలోని కోలిండియా ప్రధాన కార్యాలయంలో కోలిండియా పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు చేస్తు న్న పోరాటానికి మద్దతుగా సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సింగరేణి విశ్రాంత ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి సంఘీభావం తెలిపారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు రాలబండి రాజన్న అధ్యక్షులు గజెల్లి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, సింగరేణి విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

గోవింద క్షేత్రంలో ఘనంగా ఉట్టి వేడుకలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట గోవింద క్షేత్రంలో సోమవారం ఉట్టి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బెటాలియన్ పరిధిలోని పలువురు చిన్నారులు గోపికా, కృష్ణుల వేషధారణలో ప్రత్యేకంగా అలరించారు. వైష్ణవ సాంప్రదాయం ప్రకారం గోవింద క్షేత్రంలో ఉట్టి కొట్టు వేడుకలను కమాండెంట్ వెంకటరాములు పర్యవేక్షణలో కనులపండువగా నిర్వహించారు. విజేతలకు కమాండెంట్ చేతుల మీదుగా రూ.1,116 నగదు పారితోషికాలు అందజేశారు.

న్యాయవాదులపై దాడులు గర్హనీయం

బెల్లంపల్లి: న్యాయవాదులపై జరుగుతున్న దాడులు అత్యంత గర్హనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, న్యాయవాది కొయ్యల ఏమాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవలి కాలంలో న్యాయవాదులపై జరిగిన దాడులను నిరసిస్తూ న్యాయవాదులు నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.